

శివాలయానికి విరాళాన్ని అందజేస్తున్న విద్యుల్లత-అమరేందర్ దంపతులు

## శివాలయ పునఃనిర్మాణానికి రూ.5లక్షల విరాళం

ఆత్మకూరు, సెప్టెంబర్ 15 : ఆత్మకూరులోని పార్వతీదేవి సమేత మహాదేవ ఆలయ పునఃనిర్మాణానికి బూర దామోదర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బూర అమరేందర్-విద్యుల్లత ఆదివారం రూ. 5లక్షలను కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి, సభ్యులు బూర కిశోర్ కుమార్, టింగిళికారు సత్యనారాయణ, సిరిపురం సంపత్, రేవూరి జయపాల్‌రెడ్డి, మందల తిరుపతిరెడ్డి, మునుకుంట్ల సతీశ్ పాల్గొన్నారు.



తెలుగు వెలుగు జాతీయ నంది అవార్డును అందుకుంటున్న సత్యనారాయణ

## సత్యనారాయణకు 'తెలుగు వెలుగు' అవార్డు

ఆత్మకూరు, సెప్టెంబర్ 15 : ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన సమాజ సేవకుడు పానుగోటి సత్యనారాయణ 'తెలుగు వెలుగు జాతీయ నంది' అవార్డును అందుకున్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన గిడుగు వెంకట రాంమ్మూర్తి జయంతి ఉత్సవాల్లో ఈ అవార్డును నిర్వాహకులు పోలోజి రాజ్‌కుమార్, అద్దంకి నాగరాజు అధ్యక్షతన చందు సాంబశివరావు, ఇస్రో మాజీ శాస్త్రవేత్త కత్తి వెంకటేశ్వర్లు సత్యనారాయణకు అందజేశారు.

# ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి

హనుమకొండ, సెప్టెంబర్ 15 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించడంతో పాటు వేసవిలో అన్ని కేటగిరీల్లో ఉద్యోగోన్నతులు ఇప్పిస్తామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డిన్నారు. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీహరి ప్రవేశపెట్టిన నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నంబర్ 11,12లను సవరించి బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయుల(ఎస్‌జీటీ)కు పీఎస్ హెచ్‌ఎం ప్రమోషన్లు ఇప్పిస్తామని, కేజీబీవీ, సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ టైం స్కేల్ ఇప్పిస్తామని స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూటీఎస్ ముందుంటుందని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. అన్ని యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు హెల్త్ కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 2024-26 సంవత్సరాలకు జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరిని ప్రకటించారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారిని సన్మానించారు. ఇటీవల మరణించిన కామిడి రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును అందజేశారు. సంఘం మాస పత్రిక సంపాదకుడు తిరుమల్‌రెడ్డి, ఇన్నారెడ్డి, సభ్యులు ఎన్‌వీఆర్ రాజు పాల్గొన్నారు.

## కాజీపేటలో గంజాయి పట్టివేత

కాజీపేట, సెప్టెంబర్ 15 : కాజీపేట పట్టణంలో పోలీసులు గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదివారం జరిగింది. సీఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే పాలిక్లినిక్ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఎస్సై నవీన్ కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా చేతిలో ప్లాస్టిక్ కవర్ బ్యాగ్ ఉన్న ఓ వ్యక్తి పోలీసులను చేసి పరుగెడుతుండగా పట్టుకుని తనిఖీ చేయగా, గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. పట్టణంలోని విప్పుపురి మహారాజుల కాలనీకి చెందిన గొర్రె ప్రశాంత్ గంజాయి వ్యాపారం చేసి ఎక్కువ డబ్బులు సంపాదించాలని 20రోజుల క్రితం వైజాగ్‌కు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి కాజీపేటకు వచ్చాడు. రైల్వే స్టేషన్‌లో ప్రజలు ఎక్కువ మంది ఉండడంతో రైల్వే పాలిక్లినిక్ సమీపంలోకి ఖాళీ స్థలంలో అమ్ముదామని నిర్ణయించుకున్నాడు. పోలీసుల తనిఖీల్లో అతడి వద్ద దాదాపు రూ.21,500 విలువైన 860 గ్రాముల గంజాయి దొరికిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న జయపాల్ కుటుంబ సభ్యులు

## వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్ల పంపిణీ

ఐనవోలు, సెప్టెంబర్ 15 : ఐనవోలు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మజ్జిగ జయపాల్ తన తండ్రి వెంకటనర్సు జ్ఞాపకార్థం పున్నేల్ క్రాస్ సమీపంలోని కనుకదుర్గ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మజ్జిగ హైమ, సంజయ్‌కుమార్, స్ఫూర్తి, విఘ్నేశ్వర సంఘం సభ్యులు నర్ర నరేందర్, వెంకన్న, అశోక్, బీరయ్య, మురళి, శ్రీను, కిరణ్, రాజు పాల్గొన్నారు.



డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ప్రమోద్‌కుమార్

## నిమజ్జనం శోభాయాత్రలో డీజేలు పెడితే కేసు

శాయంపేట, సెప్టెంబర్ 15 : వినాయకుడి నిమజ్జనంలో డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. శాయంపేట పోలీసు స్టేషన్‌లో మండలంలోని డీజే నిర్వాహకులకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వినాయకుడి నిమజ్జనం జరుగుతున్నందున డీజేలను పెట్టవద్దని స్పష్టం చేశారు. డీజేలు పెడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## ఇద్దరిపై అట్రాసిటీ కేసు

శాయంపేట, సెప్టెంబర్ 15 : కులం పేరుతో దూషించిన ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పత్తిపాక గ్రామానికి చెందిన దైనంపల్లి మల్లికార్జున్ 2021లో అదే గ్రామానికి చెందిన వంగ కొమురయ్య వద్ద 22 గుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు తెలిపారు. జనవరి 22న భూమికి హద్దులు నాటించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన చల్ల సాంబరెడ్డి, చల్ల భాస్కర్‌రెడ్డి ఇక్కడ నీకు భూమి ఎక్కడిది అని కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. రెడ్డి వాళ్ళ మధ్యలో భూములు కొంటావారా అంటూ కులం పేరు పెట్టి తిట్టి వంగ కొమురయ్య నాటిన హద్దులను పీకేసినట్లు చెప్పారు. ఈ ఘటనపై అతడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సంప్రదించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

హసన్‌పర్తి, సెప్టెంబర్ 15 : తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ చేసిన ఘటన హసన్‌ర్తిలో జరిగింది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన వెల్మ రాజేందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఈ నెల 12 తేదీన వేములవాడ దేవస్థానానికి వెళ్లాడు. తిరిగి 14న ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలోని బంగారు గొలుసు, కమ్మలు, మాటీలు (సుమారు రూ.80వేలు), రూ.10వేల నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు రాజేందర్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హసన్‌పర్తి, సెప్టెంబర్ 15 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. పెగడపల్లికి చెందిన దామెర శ్రవణ్ (23) ప్లంబర్ పని చేసుకుంటూ జీవించేవాడు. శనివారం బైక్‌పై బయటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. శ్రవణ్ ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్కల వారిని అడుగగా సమాచారం తెలువలేదు. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో తమ బంధువు మేకల నాగరాజు ఫోన్ చేసి శ్రవణ్ వంగపహాడ్ ఆరెపల్లె వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్‌ను ఢీకొని మృతి చెంది ఉన్నాడని సమాచారం ఇచ్చాడు. దీంతో కుంటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లో బర్రెలు



సీఆర్పీఎఫ్ బెటాలియన్ మైదానంలో బర్రెలు

నయీంనగర్, సెప్టెంబర్ 15 : హనుమకొండ పలివేల్పుల రోడ్డులోని 58వ సీఆర్పీఎఫ్ బెటాలియన్‌ను మణిపూర్‌కు మార్చిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రాంతాన్ని పోలీసులు తమ స్వాధీనంలోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ ఎవరూ లేకపోవడంతో బెటాలియన్ మైదానం బర్రెలకు నిలయంగా మారింది. ఈ క్రమంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారకముందే సంబంధిత అధికారులు స్పందించి జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అద్దె బస్సుల ఓనర్ల సమావేశం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 15 : హనుమకొండ హంటర్ రోడ్డులోని అభిరామ్ గార్డెన్స్‌లో ఆదివారం హనుమకొండ, వరంగల్-1, 2 డిపోల అద్దె బస్సు ఓనర్ల సమావేశం నిర్వహించారు. అద్దె బస్సు ఓనర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. అద్దె బస్సుల ఓనర్లంతా సీఎం సహాయనిధికి రూ.50 లక్షలు అందిస్తామని రీజినల్ అధ్యక్షుడు మారపల్లి రాంరెడ్డి తెలిపారు.

## మత్స్యగిరి స్వామి గుడికి చేయూత

శాయంపేట, సెప్టెంబర్ 15 : శాయంపేటలోని మత్స్యగిరి స్వామి ఆలయానికి పంచాయతీ రాజ్ శాఖ రిటైర్డ్ డిప్యూటీ ఇంజినీర్ వలపదాసు విజయ్ కుమార్ రూ.60 వేలు ఖర్చు చేసి గ్రానైట్ రాయి వేయించారు. కాగా, ఆదివారం పనులు పూర్తి కావడంతో ఆలయ చైర్మన్ సామల భిక్షపతి విజయ్ కుమార్‌ను సత్కరించారు.

## 'చెరువుల పరిరక్షణకు వాడ్రా ఏర్పాటు చేయాలి'



హనుమకొండ అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

హనుమకొండ, సెప్టెంబర్ 15 : వరంగల్ చెరువుల పరిరక్షణ కోసం వాడ్రా ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. భద్రకాళీ, వడ్డేపల్లి చెరువుల్లో కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హనుమకొండలోని అదాలత్ సెంటర్‌లో అమరుల స్తూపం వద్ద వీసీకే పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. వాడ్రాను ఏర్పాటు చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, డాక్టర్ తిరునహరి శేషు, కొంద్ర నర్సింగరావు, డాక్టర్ వెంగళ్ రెడ్డి, సాయిని నరేందర్, డాక్టర్ చింతం ప్రవీణ్, తాడిశెట్టి క్రాంతి కుమార్, గాజాల గోవర్ధన్, మల్యాల కృష్ణ, రాజేందర్, మాద్దుల నర్సయ్య పాల్గొన్నారు.


## బహుమతుల ప్రదానం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 15 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తిష్ఠ గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా 9వ రోజు సిద్ధిబుద్ధి సమేత గణపతిగా అలకరించారు. స్వామివారికి అర్చనాది కార్యక్రమాలు నిర్వర్తించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. స్వామివారిని జింక వాహనంలో ఊరేగించారు. సాయంత్రం పేరిణి, కూచిపూడి, భరతనాట్యం చేసిన కళాకారులకు ఆర్యవైశ్య జాతీయ నాయకుడు గట్టు మహేశ్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు.



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న గంగు ఉపేంద్రశర్మ, మహేశ్‌బాబు

# బంగారమే శ్రీరామరక్ష!



**ఆపత్కాలంలో** ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

**పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ**

| బ్యాంక్ | వడ్డీరేటు(శాతంలో) | ప్రాసెసింగ్ ఫీజు |
|---|---|---|
| కొటక్ మహీంద్రా | 8 నుంచి 24 వరకు | 2 శాతం+జీఎస్టీ |
| హెచ్‌డీఎఫ్‌సీ | 8.30 నుంచి 16.55 వరకు | ఒక్క శాతం |
| సెంట్రల్ బ్యాంక్ | 8.40 నుంచి 9.25 వరకు | రుణంపై అరశాతం |
| యూకో | 8.50 | రూ.250-5 వేల వరకు |
| ఇండియన్ బ్యాంక్ | 8.80 నుంచి 9 వరకు | రుణంపై 0.56 శాతం |
| యూనియన్ బ్యాంక్ | 8.65 నుంచి 9.90 వరకు | - |
| ఎస్బీఐ | 8.70 | అర శాతం+జీఎస్టీ |
| ఇండస్‌ఇండ్ | 8.75 నుంచి 16 వరకు | రుణంపై ఒక్క శాతం |
| బంధన్ బ్యాంక్ | 8.75 నుంచి 19.25 వరకు | ఒక్క శాతం+జీఎస్టీ |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 9.15 | వర్తించే చార్జిలు+జీఎస్టీ |
| పంజాబ్ నేషనల్ | 9.25 | రుణంపై 0.75 శాతం |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 9.30 | రూ.500-2,000+జీఎస్టీ |
| ఫెడరల్ బ్యాంక్ | 9.49 | - |
| కెనరా బ్యాంక్ | 9.60 | రూ.500-5 వేల వరకు |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 10 | రుణంపై ఒక్క శాతం |

**క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..**

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

**కావాల్సిన డాక్యుమెంట్లు**

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

**తిరిగి చెల్లింపులు ఎలా..**

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్నవారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

## రాబడి

మార్కెట్ పల్స్



# ఫెడ్ నిర్ణయమే కీలకం..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

## యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

**ప్రభుత్వ** రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.

## కొత్త పీపీఎఫ్ రూల్స్

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..**

**పబ్లిక్** ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

# షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

## లాభాలు, పరిమితులు తెలుసా?



**షార్ట్-టర్మ్** ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

**షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి**

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

**చివరగా..**

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.